# ఉపాయంలో అపాయం



చిన్నయ్య లైబ్రరీ అరుగుల మీద మిత్రబృందంతో కూర్చున్నాడన్న మాటేగాని క్షణాలు యుగాల్లా గడుస్తున్నాయి. గతరాత్రి ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా అని గంటకోసారి లేచి చూడడమే. ఉదయం పదిగంటల ట్రిప్పు బస్ కోసం బస్‌స్టాండ్ చుట్టూ జోరీగలా తిరుగుతూనే వున్నాడు.

బస్‌లో రావాల్సిన వాళ్లు వచ్చేదాకా, వాళ్లను ఇంటికి తీసుకెళ్లే దాకా మనసుకు నిలకడంటూ లేకుండా పోయింది. ఇక మధ్యాహ్నం నుంచి చూపులన్నీ పొద్దు మీదే. రాత్రెప్పుడవుతుందా, ఊరెప్పుడు సద్దు మణుగుతుందా అన్న ధ్యాస తప్ప మరోటి లేకుండా పోయింది.

రాత్రి ఏడుగంటల కల్లా అన్నం తిని ఇంట్లోంచి బయట పడి, రోజులానే లైబ్రరీ అరుగుల మీదకు చేరాడు. కుర్రవాళ్లు గోలగా ఒకడి మీద మరొకడు జోకులేసుకొంటూ, కేరింతలు కొడ్తున్నారు. సరదా సరదాగా తిట్టుకుంటున్నారు. ఉత్తుత్తి దెబ్బలాటలు ఆడుకుంటున్నారు. ఈ రోజు ఆ గోల చిన్నయ్య బుర్రలోకి ఏం ఎక్కుతున్నట్టు లేదు. డబ్భై రెండు కేజీల బరువు, ఐదడుగుల ఆరంగుళాల శరీరం మాత్రమే అక్కడ పోతబోసి కూలబడేసినట్టుంది. అప్పటికే రెండు జోకులు చిన్నయ్య మీద పేలాయి. చెవిలో దూరితేగా!

"ఒరేయ్ సూరాయ్! తూనీగోడేందిరా, ఈ రోజు మన్ను దిన్న పాములాగయిపోయాడు?" అంటూ జోకు విసిరాడొకడు.

ఊరిలో చిన్నయ్యను అసలు పేరుకన్నా 'తూనీగోడు' అంటేనే చటుక్కున పోల్చుకుంటారు. పెళ్లయ్యాక నలుగురూ చివాట్లేస్తే మానేశాడు గాని అంతకు ముందు తూనీగల్ని పట్టటం, తోకకు దారాలు కట్టి ఆడిస్తూ పరుగులు పెట్టటం వాడి కిష్టమైన ఆట. చిన్నయ్య దరిదాపుల్లోకి రావడానికి ఆ ఊరి తూనీగలు గజగజలాడి పోయేంతగా ఆ మూగజీవాల్ని హడలెత్తించేశాడు.

"తూనీగల ఉసురు కొట్టే వీడికి చదువబ్బడం లేదు. వీడు గనుక బడిలో వుంటే ఈ పిచ్చ పిల్లలందరికీ పట్టించి చదువులు చంకనాకిస్తాడు" అంటూ బడి నుండి గెంటేశాడు పంతులుగారు. తండ్రి కూడా వాడి మీద ఆశలొదులుకొని పని పాటల్లోకి దించాడు.

"పాపం! మన తూనీగోడికి ఆడ తూనీగ మీద గుబులైందేమోరా?" నారి గాడు అందిపుచ్చుకున్నాడు.

ఆ మాటలకు అంతా గొల్లున నవ్వారు. ఆ నవ్వులకు చిన్నయ్య కాస్త స్పృహలోకి వచ్చాడు. "ఏందిరా వాగుతున్నారు.?" అంటూ చర్రున లేచాడు.

" ఏం లేదు బాబాయ్! బెల్లం కొట్టిన రాయిలాగ కూచుంటే, పెళ్లాం మీదికి మనోడికి గాలి మళ్లిందేమోరా అంటున్నారు మిత్రబృందం" అంటూ భుజం సవరించాడు కోటేసు.

"ఏధవలు, ఏధవ మాటలు....పోండెహె" అంటూ కాస్త సిగ్గుపడ్డాడు చిన్నయ్య.

"రాత్రయింది గదా! పడక సీను ఫ్లాష్‌బ్యాక్‌లో తేలిపోతున్నాడేమో!" అన్న సూరి మాటలకు గొల్లున నవ్వారు బృందం.

" ఒరేయ్! ఇట్లయితే నే బోతా" అంటూ లేచాడు చిన్నయ్య. ఇంటికి వెళ్లాలని బయలు దేరటం ఇప్పటికి అది మూడోసారి. రోజూ అర్ధరాత్రి దాటినా అరుగుదిగి ఇంటి దారి పట్టని వాడు మాటి మాటికి వెళ్లటానికి సిద్ధపడుతుంటే మిత్ర బృందానికి ఆశ్చర్యమనిపించింది. నిజానికి చిన్నయ్య మనసు కూడా ఇంటి చుట్టూ తిరుగుతోంది. రాత్రి పదన్నా గాకుండా ఇంటికెళ్లటం బాగుండదని చూస్తున్నాడు.

" ఏరోయ్ చిన్నోడా! పొద్దుట బస్‌లో మీ ఆవిడ ఊరు నుంచి వచ్చినట్లుందే" అడిగాడు అప్పుడే అరుగుల మీదకు చేరిన చౌదరయ్య.

చిన్నయ్య పరధ్యానానికి, ఇంటికి పోవాలన్న తొందరకు కారణం ఏంటన్నది అక్కడున్న అందరికీ అర్థమైంది. "అద్దిరా సంగతీ!" అంటూ అసలు విషయం కనిపెట్టినట్లు కోటిగాడు గుర్రంలా సకిలించాడు. మళ్లీ గోలగా అరుపులు.

"ఎందుకురా వాణ్ణి ఏడిపిస్తారు? మీ పెళ్లాలు మాత్రం మీకు బెల్లం ముక్కలు కాదంట్రా! పెళ్లయిన కొత్తలో ఇంటి గడప దాటి ఈ అరుగుల మీది కొచ్చి కూచున్న మగాడెవరో చెప్పండ్రా" అంటూ చౌదరయ్య ఎదురు దాడికి కుర్రకారు వెనకడుగు వేశారు.

చిన్నయ్య మానసిక పరిస్థితిని మిత్రబృందం సరిగానే అంచనా వేసింది. అతడి మనసు కోరికలతో ఉరకలేస్తున్న మాట అక్షరాల నిజం. కాన్పు కారణంగా పది నెలల బట్టి భార్యకు దూరంగా వుండాల్సొచ్చింది. ఆ ఎడబాటును అతి కష్టం మీద ఇన్నాళ్లు భరించగలిగాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో భార్య ప్రసవించి ఆడపిల్లను కన్నది. పొత్తిళ్లలో పండంటి బిడ్డను చూస్తూ మా ఇంటి మహాలక్ష్మి పుట్టిందని తెగ మురిసిపోయాడు. ఆ తర్వాత నెల దాటాక అత్తారింటికి వెళ్లాడు. ఒక ప్రక్క కూతుర్ని క్షణం వదలకుండా ముద్దులాడుతూనే, ఎప్పుడు రాత్రవుతుందా భార్యతో ఏకాంతం దొరుకుతుందా అంటూ ఒకటే తపనబడ్డాడు.

అలాంటిది రాత్రి తనకు పడక పంచలో ఏర్పాటు చేసే సరికి చిర్రెత్తుకొచ్చింది. భార్య మీద, అత్తారింటి వారి మీద అంతులేని కోపం ముంచుకొచ్చింది. మర్యాద కాదనుకొని కోపం దిగమింగుకున్నాడు. భార్యతో తను కలవటానికి అభ్యంతరం

ఏమిటో తెలియక విలవిల్లాడిపోయాడు. మంచం మీద అటు ఇటు పొర్లటమేగాని నిద్రపడితే ఒట్టు.

నడిజాము దాటాక కేరుమంటూ పిల్ల ఏడుపు. మంచి సాకు దొరికి నట్లయింది. "ఏందే పిల్లని ఏడిపిస్తన్నావు" అంటూ తలుపు నెట్టుకుని లోపలకు చొరబడ్డాడు.

అప్పటికే శాంతి లేచి పిల్లను రొమ్ములకు హత్తుకొని పాలు తాగిస్తున్నది. అలా చూస్తుండగానే పిల్ల ఆకలి తీరి నిద్రలోకి జారిపోయింది. "ఆకలై ఏడుస్తుంది లేవయ్యా. పడుకో పోయి"అంటూ పిల్లను ఉయ్యాల తొట్టెలో పడుకో బెట్టిందో లేదో భార్యను ఒక్క సారిగా కౌగిలిలోకి తీసుకొని ముద్దులతో ఉక్కిరి బిక్కిరి చేశాడు. అతని చేతుల్లో కరిగిపోతూ పరవశం పొందుతున్న శాంతి క్షణాల్లోనే తేరుకొని చిన్నయ్య పట్టునుండి ఒడుపుగా విడిపించుకొంది.

"ఎన్నాళ్లకో వత్తే, దూరం బెడ్తావేందే?" అన్నాడు దగ్గరకు లాక్కునే ప్రయత్నం చేస్తూ.

"చాల్లే పో మావా! మూడేళ్లు పిల్లలు పుట్టకుండా జాగ్రత్త గుండాలంట. అప్పుడే నా ఆరోగ్యానికి , పిల్లల ఆరోగ్యానికి మంచిదని మా ఊరు నర్సుగారు చెప్పింది" అంది అభ్యంతరం పెడుతూ..

"ఛత్! ఎవతే ఆ నర్సమ్మ,బుద్ధిలేంది?" కోపంతో రుసరుసలాడాడు.

"అట్టా తిడతా వేంది? బిడ్డ నా కడుపున పడినప్పట్నుంచి బయట పడేదాకా అంతా చూసింది ఆయమ్మ గాదూ! డాక్టరమ్మతో పరీక్షలు చేయించింది.ఇంజీషన్లు, బలానికి టానికు లిప్పించింది.కాన్పుకి ఆసుపత్రి కి తీసుకెళ్లి పురుడుబోయించి పైసా ఖర్చు లేకుండా సాయం జేస్తేను" అంటూ మండిపడింది.

"సర్లేవే! మొగుడూ పెళ్లాల్ని ఇట్టా దూరం బెడ్తే ఎట్టా చచ్చేది" తలగోక్కున్నాడు.

"చూడుమావా! పెద్దోళ్లు మన మంచికే చెప్తారు.వెంటనే కడుపుగాని వచ్చి మళ్లీ కనాల్సొస్తే నా ఆరోగ్యానికి మంచిది కాదంట. నా మాటినవయ్యా!" అంటూ గడ్డం పుచ్చుకొని బతిమాలింది.

ఆ మాటలకు చిన్నయ్యకు కోపంతో పాటు, ఉవ్వెత్తున లేచిన కోరిక కూడా పాలపొంగులా చప్పున అణగారిపోయింది. నిగ్రహం పాటించి నిరాశగా బయటకు నడిచాడు. నాలుగు రోజులు వుందామనుకొని వెళ్లిన మనిషి ఉసూరుమంటూ తిరిగొచ్చాడు.

మూడో నెలలో తిరిగి అత్తారింటికెళ్లాడు. మంచి రోజు చూచి భార్యను పంపమని చెప్పాడు. చంటి పిల్లతో పని చేసుకోటానికి ఇబ్బందని, ఐదో నెలలో పంపిస్తామని అత్త వేడుకుంది. అదీగాక అత్తగారింట్లో వున్న పాడి సదుపాయం అక్కడ లేదు. భార్యా బిడ్డల పోషణ కయ్యే ఖర్చుల గురించి ఆలోచించి కాదనలేకపోయాడు.

రాత్రి ఎక్కడివాళ్లక్కడ పక్కల మీదికి చేరుకోగానే, అదును కోసం వేచి చూస్తున్న చిన్నయ్య భార్యను కౌగిలిలోకి తీసుకొన్నాడు. ఆరేడు నెలలుగా సంసార సుఖానికి దూరంగా వున్నాడేమో కోరికల సెగతో వళ్లు వేడెక్కిపోయింది. శాంతి భర్త చేతుల్నుంచి లాఘవంగా తప్పుకొని దూరం జరిగింది.

"ఉప్పు కారం తింటున్న మగాణ్ణి. మూడేళ్లు సంసారం చెయ్యకుండా ఎట్టానే చావటం?" అంటూ మొండికి తిరిగాడు.

"అది కాదు మామా! మొన్న పిల్లకు పోలియో చుక్కలు, టీకామందులు వేయించుకోటానికి పోయినప్పుడు అడిగాను. కడుపు రాకుండా జాగ్రత్త పడొచ్చంది. ఇళ్ల తనిఖీకి వచ్చినప్పుడు సావధానంగా వివరాలు చెప్తానంది. అంతదాకా దూరంగుండలేవా?" దీనంగా ప్రాథేయపడింది.

"ఆ మా తల్లి చెప్పేదెప్పుడూ, మనం సంసారం చేసేదెప్పుడూ?" అంటూ లబలబలాడి పోయాడు.

"ఆయమ్మే చెప్పాలనేవుంది. మేవేగాదు మీ మగాళ్లూ ఈ సంగతులు తెలుసుకోవాలంట. మీ ఊళ్లో నర్సమ్మనడిగి తెలుసుకోవచ్చుగా మామా!" చెప్పింది శాంతి. ఆ మాటలకు నీరుగారిపొయ్యాడు చిన్నయ్య.

◆ ◆ ◆

ఊరికి తిరిగొచ్చాక సబ్‌సెంటర్‌లో నర్సుని కలిశాడు. చూస్తే నిండా పాతి కేళ్లు లేని యువతి. తను సిగ్గుపడ్డా అడగక తప్పలేదు. చిన్నయ్య అడిగిందే తడవుగా ఆ అమ్మాయి కుటుంబ నియంత్రణ పద్ధతులు ఏకరువు పెట్టసాగింది.

"పిల్లలు కలగకుండా ఆడాళ్లయితే ట్యూబెక్టమీ, మగాళ్లయితే వేసక్టమీ చేయించుకోవచ్చు. నిజానికి మగాళ్లకు చేసే పద్ధతి చాలా సులువు" అంటూ చెప్పటం మొదలెట్టింది.

"భార్యా భర్తలు సంసారం చేస్తూనే పిల్లలు కలగకుండా ఎట్టాంటి జాగ్రత్తలు తీసుకోవచ్చో ముందు చెప్పండి" అంటూ అడిగాడు.

"ఆడాళ్లు లూపు వేయించుకోటం ఒకరకం. గర్భనిరోధక మాత్రలు మింగటం రెండో రకం. మూడోరకం మగాళ్లు కండోమ్‌లు వాడుకోవాలి... ఇది సులభమైన పద్ధతి" అంటూ గడగడ చదివేసింది.

"కండోములంటే మగాళ్లు మింగేవాండీ?" అమాయకంగా అడిగాడు.

ఆ పిల్లకు నవ్వుతోపాటు, చెప్పటానికి సిగ్గూ ముంచుకొచ్చింది. "అవి మింగే బిళ్లలు కాదు. సంసారం చెయ్యబొయ్యే ముందు ఉపయోగించాలి" అంటూ కండోమ్ పేకెట్ చిన్నయ్యకిస్తూ టూకీగా ఉపయోగించే విధానం చెప్పింది. ఓస్ ఇంతేనా? అనుకున్నాడు అంతా విన్నాక. వీలు వాలు చూసుకొని అత్తారింటికి వెళ్లాలని ఉబలాట పడుతున్నంతలో తొలకరొచ్చింది. ముమ్మరంగా వ్యవసాయ పనులు మొదలయ్యాయి. ఊపిరి సలపని పనులతో ఊరొదిలి వెళ్లే వీల్లేకపోయింది. అంతలో ఐదోనెల రానే వచ్చింది. భార్యను తీసుకొస్తున్నట్లు అత్తారింటి నుంచి కబురొచ్చింది.

అరుగుమీద కుర్రాళ్లు కొత్తగా విడుదలయిన సినిమాల చర్చల్లో మునిగిపొయ్యారు. తమ అభిమాన హీరోల డైలాగులు, డాన్సులతో రెచ్చిపోయి మరీ గోల చేస్తున్నారు. ఇదే సందుగా చిన్నయ్య మెల్లగా అరుగుదిగి ఇంటి దారి పట్టాడు.

చిన్నయ్య ఇంటికెళ్లే సరికి తల్లి దండ్రులిద్దరూ పంచలో మంచాలేసుకొని గురకలు పెట్టి నిద్రపోతున్నారు. లోనికి వెళ్తూనే మెల్లగా తలుపు గడియ పెట్టాడు. మంచంమీద వెల్లకిలా పరుండి నిద్రకుపక్రమిస్తున్న శాంతిని చూస్తూనే చిన్నయ్య మనసులో అణిచిపెట్టిన కోరికలు ఒక్కసారిగా కట్లు తెంచుకున్నాయి. క్షణాల్లో శాంతి పక్కకు చేరి అమాంతం అమీబాలా చుట్టేశాడు.

"ఊఁహు! అప్పుడే కాదంటూ" ప్రతిఘటించబోయింది.

"ఏయ్! భయపడమాక. మా ఊరి నర్సు మంచి ఉపాయం చెప్పింది. మనం కావాలనుకుంటేనే పిల్లలు పుడ్తారు" అంటూ భార్య పెదాల్ని తన పెదాలతో మూసేశాడు చిన్నయ్య.

◆ ◆ ◆

ముచ్చటగా మూడు నెలలు గడిచాయి. ఒకరోజు చిన్నయ్య పొలం నుండి ఇంటికొచ్చే సరికి శాంతి దిగాలుగా కూచునుంది.

"మావా! కొంప మునిగింది. దూరం గుండమంటే తగు జాగ్రత్తలోనే వున్నానంటివి. నెలసరి రాలేదు" అంటూ చెప్తే చిన్నయ్య గుండె గుభేలుమంది.

"చస్! అదెట్టా జరుగుద్దే. నీ ఆరోగ్గెంలో ఇంకేవన్నా తేడా పడ్డదేమో! పట్నంబోయి పెద్ద డాక్టరమ్మ కాడ చూయించుకొద్దాం. పద" అంటూ బయల్దేరదీశాడు.

పరీక్ష చేసిన డాక్టరమ్మ గర్భిణంటూ తేల్చిచెప్పింది.

చిన్నయ్య మనసులో రకరకాల సందేహాలు. తను నర్సమ్మ చెప్పినట్టు జాగ్రత్త తీసుకున్నా కడుపు రావటం ఏమిటి? జరిగింది పొరపాటా? మోసమా? చాటు మాటు భాగోతం ఏమన్నా నడుస్తున్నదా? కొద్దిగా మొదలైన అనుమానం పెరిగి పెరిగి పెనుభూతంలా వెంటాడసాగింది. సంయమనం కోల్పోయాడు.

"నిజం చెప్పు! నువ్వేదో తప్పుడు పని చెయ్యకపోతే ఇట్టా జరగదు" అంటూ భార్యమీద విరుచుకు పడ్డాడు.

శాంతి బావురుమంది. "లేదు మావా! దేవుడి మీదొట్టు. నేనేం తప్పు చెయ్యలేదు. నా కట్టాంటి పాడు బుద్ధుల్లేవు" అంటూ చిన్నయ్య కాళ్లా వేళ్లా పడింది. చిన్నయ్యకు నమ్మకం కుదర్లేదు. బామ్మర్దికి ఫోన్ చేసి అత్తమామల్ని రప్పించాడు. భార్యను నమ్మలేకపోయాక కాపురం చెయ్యలేను, తీసుకు పొమ్మంటూ రచ్చజేశాడు.

"అల్లుడూ! నా కూతురు బంగారం. అభంశుభం తెలీని పిల్లమీద నిందవేస్తే ఊరుకునేది లేదు. అభిమానానికి తలన్నా కోసుకుంటాంగాని తప్పుచేసి తలదించుకొనే వాళ్లం గాదు" అంటూ గట్టిగా కూతురి పక్షాన నిలబడింది.

భార్య తప్పుడు పని చేసిందనటానికి సాక్ష్యంగా నర్సమ్మను తన పక్షాన నిలబెడ్తానన్నాడు చిన్నయ్య. తమ కూతురు నిప్పులాంటిదని పెద్ద డాక్టర్ సమక్షంలోనే నిజం నిరూపణ చేస్తామని అత్తమామలు రోషపడ్డారు. ఇరుపక్షాలూ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరాయి..

అంతా విన్నమీదట డాక్టర్‌కి విషయం బోధపడింది. తను జాగ్రత్త తీసుకున్నా భార్యకు గర్భం రావటంతో చిన్నయ్య భార్య శీలాన్ని శంకిస్తున్నాడని డాక్టర్ గ్రహించాడు. నిరోధ్‌ను సరియైన పద్ధతిలో ఉపయోగించని సందర్భంలో ఇలాంటి పొరపాట్లు జరుగుతాయన్న విషయం డాక్టర్‌కి తెలియనిది కాదు. ఆ మాటే చిన్నయ్యకు చెప్ప జూశాడు. ఊహుఁ! చిన్నయ్య ససేమిరా ఒప్పుకోవటంలేదు.

"సారూ! నా వల్ల పొరపాటు జరిగుంటదన్న అనుమానం వుంటే, మా ఇంటికి రండి. మీ కళ్లతో మీరే చూడొచ్చు. నాది కరెక్టని మీరే ఒప్పుకుంటారు" చిన్నయ్య మాటలు డాక్టర్‌కి విచిత్రంగా తోచాయి. ఇందులో కళ్లతో చూడాల్సిందేమిటో బోధపడింది కాదు. ఏదో తిరకాసుందనిపించి సరేనంటూ చిన్నయ్య ఇంటికి బయల్దేరాడు.

చిన్నయ్య నేరుగా డాక్టర్ని స్నానాలదొడ్డి దగ్గరకు తీసుకెళ్లాడు. తాటాకులతో, వెదురు బద్దలతో చేసిన దొడ్డది. "ఇదిగో మీ కంటితో మీరే చూడండి" అంటూ దడికేసి చూపించాడు.

అక్కడ పుల్లలకు గుచ్చిన కండోమ్‌లు వరుసగా దడికి వేలాడుతున్నాయి. "సార్! నర్సమ్మ చెప్పినట్టే మా ఆవిడతో సంసారం చెయ్యటానికి ముందు ఆ తొడుగు పుల్లకు తొడిగి, దడికి గుచ్చి ఎల్లే వాడ్నండి" అమాయకంగా చెప్పాడు చిన్నయ్య.

పొరపాటు గ్రహించిన డాక్టర్‌కు నవ్వాగలేదు. ఆయనట్టా ఎందుకు నవ్వుతున్నాడో చిన్నయ్యకు అర్థంకాలేదు. అర్థమైనవాళ్లు డాక్టర్ నవ్వుతో శ్రుతి కలిపారు.

"ఏవమ్మా! అతనికి డిస్‌ప్లే పుల్లతో చేసి చూపించావా?" అడిగాడు ఆరోగ్య కార్యకర్తను. దోషిలా తలొంచుకొంది ఆ అమ్మాయి.

" ఇలాంటి విషయాల్లో ప్రోపర్‌గా పబ్లిక్‌ని ఎడ్యుకేట్ చెయ్యకపోతే ఎలాంటి అనర్థాలు జరుగుతాయో చూశావు గదా! డమ్మీతో ఎక్స్‌ప్లెయిన్ చెయ్యాల్సిన దానివి కండోమ్ పుల్లకు తొడిగి చూపించావు. ఆ అమాయకుడు పొరపాటుగా అర్థం చేసుకోవటం వల్ల ఇంత అల్లరి జరిగింది'' అంటూ ఆమెను సుతిమెత్తగా మందలించాడు. స్త్రీ సహజమైన సిగ్గుతో ఆమె చెప్పాల్సిన విధంగా చెప్పలేదని డాక్టర్ గ్రహించాడు.

"చూడు చిన్నయ్యా! నువ్వు సంసారం చెయ్యబొయ్యేముందు ఆ తొడుగును మర్మావయవానికి తొడగాలి తప్ప ఇలా పుల్లకు తొడిగి దడికి గుచ్చకూడదు. అది తొడగటంలో కూడా ఒక శాస్త్రీయమైన పద్ధతి వుంది. తొడిగేటప్పుడు ఏ మాత్రం గాలి చొరబడినా కండోమ్ పగిలిపోతుంది. అనుకున్న ప్రయోజనం నెరవేరదు" అంటూ అప్పటికప్పుడు మేల్ ఆర్గాన్ డమ్మీతెప్పించి, కండోమ్ ఎలా తొడగాలో చూపించాడు డాక్టర్.

అపరాధ భావంతో చిన్నయ్య తలెత్తుకోలేక పోయాడు. సమస్య పరిష్కార మైనందుకు అందరూ సంతోషించారు.

"శాంతి! చదువు సంధ్యల్లేని మొద్దోణ్ణి. నిన్ను అనుమానించి నలుగురిలో అల్లరి చేశాను. ఈ తప్పుకాయి" అంటూ పశ్చాత్తాపంతో చెంపలేసుకొన్నాడు చిన్నయ్య.

❄

*(నిజంగా జరిగిందని చెప్పబడుతున్న ఒక ఉదంతం*

*ఆధారంగా రాసిన కథ)*

*(స్వాతి స్వపరి వారపత్రిక, 12-8-2011)*